

నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
13 | హైదరాబాద్, గురువారం 1 ఫిబ్రవరి 2024 | YADADRI BHUVANAGIRI



స్వామి వారి నిత్య కళ్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

## లక్ష్మీనరసింహుడికి వైభవంగా నిత్యారాధనలు

యాదగిరిగుట్ట, జనవరి31: యాదగిరిగుట్టలో లక్ష్మీనరసింహ స్వామికి బుధవారం నిత్యారాధనలు వైభవంగా జరిగాయి. తెల్లవారుజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వయంభూ నారసింహ స్వామిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన, ఆరగింపు చేపట్టారు. ప్రధానాలయంలో స్వయంభువునకు నిజాభిషేకం జరిపారు. స్వామివారికి తులసి సహస్ర నామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. లక్ష్మీనరసింహుడి నిత్య తిరు కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గంటన్నర పాటు అర్చక బృందం శాస్త్రోక్తంగా కల్యాణ తంతు జరిపారు. ప్రధానాలయ వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శ ఆళ్వారులను కొలుస్తూ హోమం జరిపారు. స్వామి, అమ్మవార్లను దివ్యమనోహరంగా ముస్తాబు చేసి గజవాహనంపై వేంచేపు చేసి వెలుపలి ప్రాకార మండపంలో ఊరేగించారు. అనంతరం లక్ష్మీసమేతుడైన కల్యాణమూర్తులను ముస్తాబు చేసి భక్తులకు అభిముఖంగా అధిష్ఠించి నిత్యకల్యాణ తంతును నిర్వహించారు. సాయంత్రం తిరువీధి సేవ, దర్బార్ సేవను కనుల పండువగా జరిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. సుమారు 8 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. అన్ని విభాగాలు కలుపుకొని స్వామి వారి ఖజానాకు రూ. 15,65,336 ఆదాయం సమకూరిందని ఆలయ ఇన్‌చార్జి ఈఓ రామకృష్ణారావు తెలిపారు.



సాగర్ ప్రాజెక్ట్ నుంచి ఎడమ కాల్వకు విడుదలవుతున్న నీరు

## ఎడమ కాల్వకు నీటి విడుదల

### తాగు నీటి అవసరాల కోసం ..

నందికొండ, జనవరి 31 : తాగునీటి అవసరాల కోసం నాగార్జునసాగర్ ఎడమ కాల్వకు బుధవారం ఎన్నెస్పీ అధికారులు నీటి విడుదల చేశారు. ఖమ్మం జిల్లాలోని పాలేరు రిజర్వాయర్ నింపడంతో పాటు ఎడమ కాల్వ పరిధిలో తాగు నీటి కోసం రోజుకు 1000 క్యూసెక్కుల చొప్పున 6వేల క్యూసెక్కులు విడుదల చేయనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం విడుదల చేసే నీటిని రైతులు పంట పొలాలకు వినియోగించ వద్దని సూచించారు.

# పార్లమెంట్ స్థానం గెలుపే లక్ష్యం

### లోక్‌సభ ఎన్నికలకు బీఆర్ఎస్ సమాయత్తం


- నియోజకవర్గాల వారీగా ఆత్మీయ సమ్మేళనాలు
- 2న భువనగిరి, 4న ఆలేరులో సమావేశం
- భువనగిరికి మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి రాక
- ఎన్నికల నేపథ్యంలో శ్రేణులకు దిశానిర్దేశం
- పార్టీ మరింత బలోపేతంపై ఫోకస్

లోక్‌సభ ఎన్నికలకు బీఆర్ఎస్ పార్టీ సన్నద్ధమవుతున్నది. భువనగిరి పార్లమెంట్ స్థానాన్ని కైవసం చేసుకోవడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నది. ఇందుకోసం అన్ని రకాల ఎత్తుగడలకు ప్రణాళిక రూపొందించింది. ఇందులో భాగంగా పార్లమెంట్ నియోజక వర్గాల్లోని అసెంబ్లీల పరిధిల్లో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనాలను నిర్వహిస్తున్నది. ఫిబ్రవరి 4న భువనగిరి, 4న ఆలేరులో ఆత్మీయ సమ్మేళనాలను చేపట్టనున్నది. దీనికి మాజీ మంత్రులు హరీశ్‌రావు, గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి హాజరుకానున్నారు. ఈ మేరకు బీఆర్ఎస్ వర్గాలు ఏర్పాట్లు చేస్తున్నాయి.

*– యాదాద్రి భువనగిరి, జనవరి 31 (నమస్తే తెలంగాణ)*

### అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపైనా సమీక్ష

గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమిపై కూడా ఈ సమావేశంలో సమీక్ష నిర్వహించనున్నారు. జిల్లాలోని రెండు స్థానాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు ఓడిన విషయం తెలిసిందే. కేడర్ నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకోనున్నారు. ఎక్కడ లోపాలు జరిగాయి..? ఎలా సరిదిద్దుకోవాలి..? పార్టీని మరింత బలోపేతం చేయడంపై చర్చించనున్నారు. అదే విధంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలపై ఫోకస్ పెట్టనున్నది. హస్తం పార్టీ హామీలను తుంగలో తొక్కుతున్న విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేలా దిశానిర్దేశం చేయనున్నది.



త్వరలో పార్లమెంట్ ఎన్నికలు జరుగనున్నాయి. ఇప్పటికే అధికార యంత్రాంగం అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నది. బీఆర్ఎస్ పార్టీ సైతం ఎన్నికలకు సమాయత్తమవుతున్నది. భువనగిరి పార్లమెంట్ స్థానాన్ని భారీ మెజార్టీతో గెలిచేందుకు వ్యూహాలు రచిస్తున్నది. కేడర్‌ను సిద్ధం చేస్తున్నది. బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనాల పేరుతో పెద్దఎత్తున సమావేశాలు నిర్వహిస్తున్నది. ఇప్పటికే పలు జిల్లాల్లో ఆత్మీయ సమ్మేళనాలు పూర్తయ్యాయి. సమావేశాల్లో ముఖ్య అతిథులుగా హాజరయ్యే నేతలు భవిష్యత్‌లో గెలుపు కోసం అనుసరించాల్సిన అంశాలపై కేడర్‌కు దిశానిర్దేశం చేయనున్నారు. పార్టీ గెలుపు కోసం తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేయనున్నారు. గులాబీ శ్రేణుల్లో మరింత ఉత్సాహం నింపనున్నారు.

### 2న భువనగిరిలో..

ఆత్మీయ సమ్మేళనాల్లో భాగంగా ఈ నెల 2న భువనగిరిలో సమావేశం నిర్వహించనున్నారు. పట్టణ పరిధిలోని సాయి కన్వెన్షన్ హాల్‌లో ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. దీనికి మాజీ మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి హాజరు కానున్నారు. సమ్మేళనానికి పార్టీ సీనియర్ నేతలతోపాటు జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, వార్డు మెంబర్లు, మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు, కోఆప్షన్ మెంబర్లు, మండల, గ్రామ కమిటీలు, పార్టీ మహిళా, యువజన, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విభాగం నేతలు పాల్గొననున్నారు. ఉదయం 11 నుంచి సాయంత్రం 5గంటల వరకు సమ్మేళనం జరుగనున్నది. మధ్యాహ్నం భోజనం ఏర్పాట్లు చేస్తున్నారు.

### 4న వంగపల్లిలో..

భువనగిరి పార్లమెంట్ పరిధిలోని ఆలేరు నియోజకవర్గంలో ఫిబ్రవరి 4న ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నారు. యాదగిరిగుట్ట మండలం వంగపల్లిలోని లక్ష్మీనరసింహ ఫంక్షన్ హాల్‌లో ఈ కార్యక్రమం జరుగనున్నది. మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ మధుసూదనాచారి ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు తెలిసింది. వాస్తవానికి ఈ నెల 29వ తేదీనే ఆత్మీయ సమ్మేళనం నిర్వహించాల్సి ఉండగా, పలు కారణాలతో వాయిదా పడింది.

### విజయవంతం చేయాలి



లోక్‌సభ ఎన్నికలకు కేడర్‌ను సమాయత్తం చేసేందుకు బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తున్నది. 2న భువనగిరి, 4న ఆలేరులో నిర్వహిస్తున్నాం. ఎలాగైనా భువనగిరి ఎంపీ స్థానాన్ని బీఆర్ఎస్ గెలిచేందుకు వ్యూహాలు సిద్ధం చేస్తున్నాం. కేడర్‌లో మరింత ఉత్సాహం నింపుతాం. ఆహ్వానం ఉన్నోళ్లందరూ తప్పకుండా హాజరై విజయవంతం చేయాలి.

– కంచర్ల రామకృష్ణారెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు



దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు స్వామివారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఆలయ అధికారులు

## దేవాదాయ శాఖ మంత్రికి సన్మానం

యాదగిరిగుట్ట, జనవరి 31: దేవాదాయ శాఖ మంత్రిగా కొండా సురేఖ బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారిగా బుధవారం ఆమెను యాదగిరిగుట్ట దేవస్థాన అధికారులు హైదరాబాద్‌లోని సచివాలయంలో కలిశారు. ఈ సందర్భంగా ఆమెను ఘనంగా సన్మానించి, స్వామి వారి లడ్డూ ప్రసాదం, చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర దేవాదాయ అధికారుల జేఏసీ చైర్మన్ గజవెల్లి రమేశ్‌బాబు, ఆలయ అధికారులు జి. రమేశ్‌బాబు, కృష్ణ, దయానంద్, మంద స్వామి, ఎం. కృష్ణస్వామి, బి. సురేంద్రాచార్యులు, ఉప ప్రధానార్చకులు కిరణ్‌కుమారాచార్యులు, అరుణ్‌కుమారాచార్యులు, వేద పండితులు పవన్ శర్మ పాల్గొన్నారు.

## 8న తుది ఓటరు జాబితా విడుదల

- కలెక్టర్ హనుమంతు కె.జెండగే



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కె. జెండగే

భువనగిరి కలెక్టరేట్, జనవరి 31 : ఓటరు జాబితా సవరణలో భాగంగా ఫిబ్రవరి 8న తుది జాబితాను విడుదల చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ హనుమంతు కె.జెండగే తెలిపారు. స్పెషల్ సమ్మరి రివిజన్-2024పై బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ఎన్నికల సంఘం ఓటు నమోదు కోసం జనవరి 1,2024 అర్హత తేదీగా నిర్ణయిస్తూ షెడ్యూలు విడుదల చేసినట్లు తెలిపారు. దాని ప్రకారం పోలింగ్ బూత్‌ల హేతుబద్ధీకరణ, ఓటరు జాబితాలో సవరణను గత డిసెంబరు 20 నుంచి జనవరి 5 వరకు చేపట్టినట్లు పేర్కొన్నారు. జనవరి 6న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురించామని, అందులో మార్పులు, చేర్పులు, తొలగింపుల కోసం 22 వరకు దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. ఈ నెల 6 వరకు డేటా బేస్ అప్‌డేట్ చేసి 8న తుది ఓటర్ల జాబితా ప్రచురించనున్నట్లు స్పష్టం చేశారు. ఈవీఎం, వీవీ ప్యాట్‌పై ఓటర్లకు అవగాహన కల్పించేందుకు కలెక్టరేట్ కార్యాలయంతో పాటు భువగిరి ఆర్డీఓ కార్యాలయం, ఆలేరు తాసీల్దార్ కార్యాలయంలో సదరు యంత్రాల ప్రదర్శన కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి ఈ నెల 6 వరకు ఓటరు నమోదు కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 24న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురిస్తామని, ఇందులో మార్పులు, చేర్పుల కోసం 24 నుంచి మార్చి 14 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. ఏప్రిల్4న పట్టభద్రుల ఓటర్ల తుది జాబితా ప్రచురించనున్నట్లు తెలిపారు. ఇందుకోసం తాసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చని, లేదా ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్ http://ceotserms2.telangana.gov.in/mlc/form18.aspxలో నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. నవంబర్ 1, 2023 నాటికి డిగ్రీ ఉత్తీర్ణులైన వారు పట్టభద్రుల ఓటు నమోదు కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఓటు నమోదు కోసం ఎపిక్ కార్డు తప్పనిసరి అని, దాంతో పాటు ఆధార్ కార్డు, డిగ్రీ సర్టిఫికెట్ జిరాక్స్ జత చేయాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఏ.భాస్కర్‌రావు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు కె.వెంకట్‌రెడ్డి, ముల్తానీషా, బట్టు రామచంద్రయ్య, అనూరాధ, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ నాగేశ్వరాచారి, డిప్యూటీ తాసీల్దార్ సురేశ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## సీఎంఆర్ సేకరణ పూర్తి అభినందనీయం

- అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు

భువనగిరి కలెక్టరేట్, జనవరి 31 : యాదాద్రి భువనగిరి జిల్లాలో వానకాలానికి (2022-23) సంబంధించి సీఎంఆర్ సేకరణ పూర్తి చేయడం అభినందనీయమని అదనపు కలెక్టర్ ఏ.భాస్కర్‌రావు అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా పౌరసరఫరాల సిబ్బంది, ఎఫ్‌సీఐ సిబ్బంది, అధికారులు, రైస్ మిల్లర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. వానకాలం(2022-23) కొనుగోలు చేసిన 2,85,217 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని జిల్లాలోని 44 రైస్ మిల్లులకు పంపించామని, అందులో 43 మంది మిల్లర్లు వంద శాతం బియ్యాన్ని అందించి జిల్లా యంత్రాంగానికి పూర్తి సహకారం అందించారన్నారు. బియ్యాన్ని అందించని గుండాల మండలం అనంతారంలోని లక్ష్మీనారాయణరెడ్డి బిన్నీ రైస్‌మిల్ నుంచి రెవెన్యూ రికవరీ చట్టం ద్వారా సొమ్మును రాబట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జిల్లాలోని రైస్‌మిల్లర్లు జనవరిలో 45,000 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ఎఫ్‌సీఐ, పౌర సరఫరాల శాఖకు అందించి సహకరించారన్నారు. యాసంగి బియ్యం సేకరణ 42 శాతం పూర్తయ్యిందని, త్వరగా మిగిలిన బియ్యాన్ని అందించి జిల్లాను రాష్ట్రంలో ముందంజలో ఉంచేందుకు కృషిచేయాలని సూచించారు. సమావేశంలో ఎఫ్‌సీఐ డివిజినల్ మేనేజర్ సుశీల్‌కుమార్‌సింగ్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ఎం. శ్రీనివాస్‌రెడ్డి, సంస్థ జిల్లా మేనేజర్ ఎం. గోపీకృష్ణ పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు

## చెర్వుగట్టు దుకాణాల వేలం



చెర్వుగట్టు పార్వతీ అమ్మవారి గుడి వద్ద వేలం నిర్వహిస్తున్న అధికారులు

నార్కట్‌పల్లి, జనవరి 31 : చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవాలయ గుట్ట కింద పార్వతీ అమ్మవారి ఆలయం వద్దనున్న షాపుల కిరాయి సంవత్సర కాల పరిమితి వేలా న్ని బుధవారం నిర్వహించారు. షాపు నంబర్1ని చౌటుప్పల్‌కు చెందిన రవి రూ. 7,60,000, షాపు నంబర్2ని చెర్వుగట్టుకు చెందిన లింగస్వామి రూ. 3,03,000, షాపు నంబర్ 3ని చెర్వుగట్టుకు చెందిన ఆండాలు రూ. 2,46,000, షాపు నంబర్ 4ని చౌటుప్పల్‌కు చెందిన బాబురావు రూ. 2,50,000లకు పాట పాడి దక్కించుకున్నారు. ఒడి బియ్యం సేకరించేందుకు చెర్వుగట్టుకు చెందిన నర్సింహ రూ. 15,10,000లకు పాట ద్వారా కైవసం చేసుకున్నట్లు ఆలయ ఈఓ నవీన్ తెలిపారు.

## ఆటోను అడ్డగించి.. దోపిడీ

**నగదు.. నగలు దోచుకున్న దొంగలు**

నేరేడుచర్ల, జనవరి 31 : కూరగాయలు కొనుగోలు చేసేందుకు ఆటోలో వెళ్తున్న వ్యక్తిని అడ్డగించిన దోపిడీ దొంగలు అతడి వద్ద ఉన్న నగదు.. నగలను దోచుకున్నారు. ఈ ఘటన నేరేడుచర్ల-మిర్యాలగూడ మార్గంలో సోమవారం చోటు చేసుకోగా.. బుధవారం వెలుగు చూసింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలంలోని పెంచికల్‌దిన్నె గ్రామానికి చెందిన బెండు వీరబాబు తన ఆటోలో ప్రతి రోజూ మిర్యాలగూడ మార్కెట్‌కు వెళ్లి కూరగాయలు కొనుగోలు చేసి తీసుకొస్తాడు. అనంతరం భార్యతో కలిసి చుట్టు పక్కల గ్రామాల్లో విక్రయించుకొని జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 29 తెల్లవారు జామున 3 గంటలకు కూరగాయలు కొనుగోలు చేసేందుకు ఆటోలో పెంచికల్‌దిన్నె నుంచి మిర్యాలగూడకు బయల్దేరాడు. మార్గమధ్యంలో కలువలదిన్నె దాటిన తర్వాత ముగ్గురు వ్యక్తులు బైక్‌పై వచ్చి ఆటోను అడ్డగించి ఆపారు. వారి వద్ద ఉన్న మారణాయుధాలతో వీరబాబును బెదిరించి అతడి వద్ద ఉన్న రూ.15 వేల నగదు, చేతికి ఉన్న 6 గ్రాముల బంగారు ఉంగరాన్ని లాక్కొని పారిపోయారు. వీరబాబు గ్రామానికి తిరిగి వచ్చి బంధువులతో కలిసి నేరేడుచర్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



సూర్యాపేట ఆర్టీసీ డిపో ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఆర్టీసీ జేఏసీ నాయకులు

## వేధింపులకు పాల్పడుతున్న ఆర్టీసీ ట్రాఫిక్ సీఐపై చర్యలు తీసుకోవాలి

**ఆర్టీసీ జేఏసీ నాయకులు**

సూర్యాపేట అర్బన్, జనవరి 31 : ఆర్టీసీ కార్మికులపై వేధింపులకు పాల్పడుతున్న సూర్యాపేట ఆర్డీసీ డిపో ట్రాఫిక్ సీఐ నాగశ్రీపై చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. సూర్యాపేట డిపో గేటు ఎదుట బుధవారం ఆర్టీసీ జేఏసీ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన సమయంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ తన ఇష్టానుసారంగా డ్యూటీ చార్ట్‌లు వేస్తూ కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. 2019లో సమ్మె సందర్భంగా నమోదైన కేసుల నిమిత్తం 14 మంది డిపో కార్మికులు కోర్టుకు హాజరు కావాల్సి ఉండగా ఇవేమీ పట్టించుకోకుండా డ్యూటీకి రావాల్సిందే అంటూ వేధిస్తున్నారని తెలిపారు. సూర్యాపేట డిపోలో చాలా కాలంగా సూపర్‌వైజర్‌లు, ఏడీసీలు పాతుకుపోయి కార్మికులపై కక్ష సాధింపునకు పాల్పడుతున్నారని ఆరోపించారు. సూపర్‌వైజర్‌లు అక్రమ వసూళ్లకు తెర లేపారని, దీనిపై విచారణ చేపట్టాలని కోరారు. ఈ విషయాలపై ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ జేఏసీ నాయకులు పనాస మధు, సుధాకర్, అంజయ్య, లచ్చయ్య, ఎన్సీ సైదులు, లక్ష్మయ్య, మధుసూదన్‌రావు, వెంకన్న, రమేశ్, సైదులు, వెంకటేశ్వర్లు, లింగయ్య, స్వామి, శ్రీకంఠం, సుజాత పాల్గొన్నారు.

## బామ్మర్దిని హత్య చేసిన వ్యక్తికి జీవిత ఖైదు

పెద్దఅడిశర్లపల్లి, జనవరి 31: సొంత బామ్మర్దిని హత్య చేసిన వ్యక్తికి జీవిత ఖైదు విధిస్తూ నల్లగొండ సెషన్స్ జడ్జి నాగరాజు బుధవారం తీర్పునిచ్చారు. గుడిపల్లి ఎస్ఐ రంజిత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తిరుమలగిరి గ్రామానికి చెందిన సీతా ముత్యాలు వివాహం మేడారం గ్రామానికి చెందిన యండ్ల మారయ్య కుమార్తె ముత్యాలమ్మతో 20 ఏండ్ల క్రితం జరిగింది. వీరికి సంతానం లేకపోవడంతో పూజ అనే అమ్మాయిని దత్తత తీసుకొని పెంచుకుంటున్నారు. ఈ విషయమై అత్తింటి వారికి ముత్యాలుకు మధ్య పలుమార్లు గొడవలు జరిగాయి. దాంతో బామ్మర్ది అంజయ్య, మామ మారయ్యపై ముత్యాలు కక్ష పెంచుకున్నాడు. ఈ నేపథ్యంలో 2017 మే 25న రాత్రి జీవాల దొడ్డి వద్ద నిద్రిస్తున్న అంజయ్యపై ముత్యాలు గొడ్డలితో దాడి చేశాడు. విచక్షణా రహితంగా నరికి చంపాడు. అంజయ్య తండ్రి మారయ్య ఫిర్యాదు మేరకు అప్పటి హెడ్ కానిస్టేబుల్ శంకర్‌రాజు, సీఐ శివరాంరెడ్డి కేసు నమోదు చేసి కోర్టుకు సమర్పించారు. కేసును విచారించిన జడ్జి నిందితుడు సీతా ముత్యాలుపై నేరం రుజువు కావడంతో జీవితఖైదుతో పాటు వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ఈ కేసులో సరైన ఆధారాలు సేకరించి నిందింతుడికి శిక్ష పడేలా చేసిన పోలీసులను జిల్లా ఎస్పీ అభినందించారు.

## ఆదివాసీ, చెంచు ప్రాంతాలను అభివృద్ధి చేయాలి

- అదనపు కలెక్టర్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్

నల్లగొండ, జనవరి 31 : ప్రధాన మంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్(పీఎం-జన్ మన్)కార్యక్రమం కింద కేంద్ర ప్రభుత్వం ఆదివాసీ చెంచు సమూహాలను అభివృద్ధి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ ఆదేశించారు. కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం పీఎం-జన్‌మన్ కింద జిల్లా వ్యాప్తంగా నాలుగు మండలాల్లోని ఎనిమిది చెంచు హ్యాబిటేషన్‌లో చేపట్టే కార్యక్రమాలపై ఆయన సమీక్షించారు. కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖతోపాటు ఎనిమిది అనుబంధ మంత్రిత్వ శాఖలు ఈ కార్యక్రమాలు అమలు చేస్తాయని అన్నారు. ఈ పథకం 2023-24 నుంచి 2025-26 ఆర్థిక సంవత్సరం వరకు అమలులో ఉంటుందని తెలిపారు. మొత్తం పదకొండు కీలకమైన అంశాలపై దృష్టి సారించి రూ.24.10 కోట్ల బడ్జెట్ కేంద్ర ప్రభుత్వం కేటాయించినట్లు చెప్పారు. జిల్లాలోని తిరుమలగిరి సాగర్, చందంపేట, గుండ్లపల్లి, నేరేడుగొమ్ము మండలాల పరిధిలోని నెల్లికల్, చిత్రియాల, గోనబోయిన పల్లె, కంబాలపల్లి, రేకుల వలయం, పొగిళ్ల, తిమ్మాపూర్, గన్నేరులపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని చెంచు జనాభాకు ఈ సంక్షేమ కార్యక్రమాలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా గిరిజన సంక్షేమ అభివృద్ధి అధికారి రాజ్ కుమార్, ఆర్‌డీఓ రాములు(దేవరకొండ), చెన్నయ్య(మిర్యాలగూడ), సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి తైక్వాండోలో మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ దీప

చౌటుప్పల్, జనవరి 31 : మున్సిపాలిటీ పరిధిలోని లక్కారం మోడల్ స్కూల్ విద్యార్థులు జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో ప్రతిభ కనబర్చారు. జనవరి 27, 28న కర్ణాటకలోని బెంగళూర్‌లో జరిగిన పోటీల్లో 6వ తరగతి విద్యార్థిని నియోజిత బంగారు పతకం, 8వ తరగతి విద్యార్థి రాంప్రసాద్ వెండి పతకాన్ని గెలుపొందారు. బుధవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రిన్సిపాల్ దీప విద్యార్థులను అభినందించారు.